ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం
19 ఫిబ్రవరి
2025





# గుట్టలో నేటి నుంచి మహాకుంభాభిషేక సంప్రోక్షణ

- బంగారు వర్ణంతో మెరిసిపోతున్న గుట్ట ఆలయం
- ఆకట్టుకుంటున్న విద్యుద్దీపాలంకరణ
- నేటి నుండి 23 వరకు 'పంచకుండాత్మక సుదర్శన నృసింహా మహాయాగం'
- 23న స్వర్ణవిమాన గోపురానికి 'మహాకుంభ సంప్రోక్షణ'
- నేడు స్వస్తివాచనంతో సంప్రోక్షణ పూజలకు శ్రీకారం
- వానమామలై రామానుజ జీయర్ స్వామి స్వీయ పర్యవేక్షణలో ఉత్సవాలు
- సర్వం సిద్ధం చేశామన్న ఈవో భాస్కరరావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: రాష్ట్ర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహుని స్వర్ణవిమాన గోపుర ఉద్ఘాటనకు సమయం ఆసన్నమైంది. పంచకుండాత్మక సుదర్శన నృసింహ యాగంతో స్వర్ణవిమాన గోపుర మహాకుంభ సంప్రోక్షణ ప్రతిష్టా పర్వాలకు బుధవారం తెరలేవనుంది. వానమామలై పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి నిర్ణయించిన ముహూర్తం ప్రకారం, స్వయంగా ఆయన పర్యవేక్షణలో పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఉత్సవాలు జరగనున్నాయి. బుధవారం స్వస్తివాచనం, పుణ్యాహవచనం, విష్వక్సేనపూజతో పంచకుండాత్మక సుదర్శన యాగానికి అర్చకులు శ్రీకారం చుట్టి స్వర్ణవిమాన మహాకుంభ సంప్రోక్షణ పూజలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు పంచకుండాత్మక సుదర్శన యాగం వైభవోపేతంగా జరగనుంది. 108 మంది రుత్వికులు, పారాయణీకులు, వేదపండితుల మూల మంత్ర, మూర్తి మంత్రి మంత్రోచ్చారణల నడుమ సుదర్శన యాగం ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ప్రధానాలయ ఈశాన్య దిశలో యాగశాలను సిద్దం చేశారు. యాగశాలలో ఐదు కుండలాలు ఏర్పాటు చేసి యాగానికి రెడీ ఉంచారు. మరోవైపు నారసింహ దివ్యవిమాన గోపురానికి స్వర్ణతాపడం బిగింపు పనులు పూర్తయ్యాయి. 23న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ ద్వారా సంప్రోక్షణ పూజల కోసం స్వర్ణవిమాన గోపురం చుట్టూ ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. స్వర్ణవిమాన గోపుర ఆవిష్కరణ కోసం చుట్టూ రెడ్ క్లాత్ ఏర్పాటు చేశారు. 23న స్వర్ణవిమాన గోపురానికి కుంభ సంప్రోక్షణ పూజలు చేసి స్వామివారికి అంకితం చేయనున్నారు. ఇక కుంభాభిషేక పూజల కోసం ప్రధానాలయంలో పనులన్నీ పూర్తి కావడంతో.. మెయిన్ టెంపుల్ ను వాటర్ తో శుద్ధి చేశారు. అష్టభుజి ప్రాకారాలు, మాడవీధులు, ఇన్నర్, ఔటర్ ప్రాకారాలను నీటితో కడిగారు. ప్రధానాలయ ముఖ మండపం, ఉపాలయాలను వాటర్ తో కడిగి శుభ్రం చేశారు.

**నేడు స్వస్తివాచనంతో పంచకుండాత్మక సుదర్శన యాగానికి శ్రీకారం**

స్వర్ణవిమాన మహాకుంభ సంప్రోక్షణ పూజల్లో భాగంగా.. మొదటగా పంచకుండాత్మక సుదర్శన మహాయాగంతో ప్రతిష్టా మహోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే పంచకుండాత్మక సుదర్శన యాగం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. బుధవారం ఉదయం 7:45 గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనంతో ఉత్సవాలు షురూ కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం రుత్విక్ వరుణం, అఖండ దీపారాధన, పర్యగ్నీకరణం,యాగశాల ప్రవేశం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, అగ్నిప్రతిష్ట.. సాయంత్రం ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన, వారుణానువాక హెూమాలు, జలాధివాసం వంటి పూజలు నిర్వహించనున్నారు. సంప్రోక్షణ పూజల్లో భక్తులను సైతం భాగస్వామ్యం చేయడం కోసం యాగశాల పక్కన ప్రత్యేక చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రధానాలయ ఉత్తరం వైపున రథశాల ఎదురుగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం వేళలో సాంస్కృతిక, సంగీత, కచేరీలు, కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఉండనున్నాయి. అలాగే ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు. రోజుకు రెండు వేల మంది భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.

**నాలుగు ద్వారాలు, ఐదు కుండలాలతో యాగశాల..**

ఐదు రోజుల పాటు చేపట్టే పంచకుండాత్మక సుదర్శన నారసింహ యాగం కోసం యాగశాలను సిద్దం చేశారు. యాగశాలకు నలువైపులా నాలుగు ద్వారాలు ఏర్పాటు చేశారు. ఐదు కుండలాలతో జరిపే సుదర్శన యాగం కోసం యాగశాలలో ఐదు యజ్ఞకుండాలు ఏర్పాటు చేశారు. 'వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుధ్, మహాలక్ష్మి' పేర్లు గల ఐదు కుండలాలను ఏర్పాటు చేశారు. యాగశాలలో తూర్పు వైపున చతురస్ర ఆకారంలో వాసుదేవ కుండలం, దక్షిణం వైపున ధనస్సు ఆకారంలో సంకర్షణ కుండలం, పశ్చిమం వైపున వృత్తం ఆకారంలో ప్రద్యుమ్న కుండలం, ఉత్తరం వైపున త్రికోణాకారంలో అనిరుధ కుండలం ఏర్పాటు చేశారు. ఇక ఈశాన్యంలో అష్టదళపద్మాల ఆకారంలో మహాలక్ష్మి కుండలం సిద్ధం చేశారు. కుండలాల నిర్మాణాలన్నీ పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఏర్పాటు చేశారు. అదేవిధంగా యాగశాల నలుదిశల్లో బ్రహ్మ, ఆంజనేయ, సోముడి విగ్రహాలు, ఈశాన్య దిశలో పాలికలను ఏర్పాటు చేశారు. ఇక యాగానికి వినియోగించే మోదుగు, మామిడి, రావి, మర్రి, జువ్వి సమిధలు, ఆవు నెయ్యిని అందుబాటులో ఉంచారు. ఐదు రోజుల పాటు జరిగే కుంభ సంప్రోక్షణ పూజలన్నీ వానమామలై రామానుజ జీయర్ స్వామి స్వీయ పర్యవేక్షణలో ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు.





## యాదగిరిగుట్టకు ఉత్సవ శోభ

స్వర్ణవిమాన గోపుర కుంభ సంప్రోక్షణ పూజలు బుధవారం నుండి షురూ కానున్న నేపథ్యంలో.. యాదగిరిగుట్ట ఆలయానికి, పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక లైటింగ్ తో ఉత్సవ శోభ సంతరించుకుంది. కొండపైన సప్తగోపుర ప్రధానాలయ సముదాయానికి, కొండ మొత్తం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. ప్రధానాలయంలో స్వర్ణ ధ్వజస్తంభం, ఉపాలయాలు, ఆంజనేయస్వామి టెంపుల్ కు విద్యుత్ కాంతులు విరజిమ్మే లైట్లు ఏర్పాటు చేశారు. కొండ కింద పాతగుట్ట చౌరస్తా నుండి వైకుంఠ ద్వారం వరకు స్వాగత తోరణాలను ప్రతిభింభించేలా దేవుళ్ల రూపాలతో కూడిన లైటింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. వైకుంఠ ద్వారం వద్ద విద్యుత్ సీరియల్ లైట్లు, దేవుళ్ల లైటింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. కనుచూపు మేర లైట్లు ఏర్పాటు చేయడంతో.. విద్యుత్ కాంతుల వెలుగుల్లో యాదగిరిగుట్ట దేదీప్యమానంగా వెలిగిపోతోంది. మరోవైపు స్వాగత తోరణాలను సైతం భారీగా ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్ట, రాయగిరి, వంగపల్లి, తుర్కపల్లి, రాజాపేటలోనే కాకుండా హైదరాబాద్, వరంగల్ నగరాల నుండి యాదగిరిగుట్టకు వచ్చే ప్రధాన మార్గాలలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. అలాగే కొండపైన జరిగే పూజాది కార్యక్రమాల వివరాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, రుత్వికులు, పారాయణీకుల వేదపారాయణాలు స్థానిక పట్టణ ప్రజలకు వినిపించేందుకు వీలుగా మైకులు ఏర్పాటు చేశారు.

**నేటి ఉదయం కార్యక్రమాలు**

శ్రీశ్రీశ్రీ శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీమద్ వేదమార్గ ప్రతిష్టాపనచార్య వానమామలై మఠం 31 వ పీఠాధిపతులు మధురకవి రామానుజ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో లక్ష్మీ నరసింహ సన్నిధిలో బంగారు విమాన గోపురం మహా కుంభాభిషేక సంప్రోక్షణ ఈనెల 23న ఆదివారం ఉదయం 11:54 గంటలకు జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాలకు అంకురార్పణ నేడు జరగనున్నది. ఉదయం 7:45 గంటలకు స్వస్తివాచనం జరుగుతుంది. అనంతరం విశ్వక్సేన ఆరాధన, నిర్వహిస్తారు. పుణ్యావాచనము, రక్షాబంధనము,

**రుత్విక్ వరణం,**

మృత్సంగ్రహణము, పర్యగ్నీ కరణము, తిరువీధి సేవ, యాగశాల ప్రవేశము నిర్వహిస్తారు. అనంతరం అఖండ దీపారాధన, సధ్యా అంకురార్పణ, ద్వార తోరణ ధ్వజ కుంభారాధన, అగ్ని ప్రతిష్ట నిత్య హెూమము, మూలమంత్ర, మూర్తి మంత్ర హవనము, నిత్య పూర్ణాహుతి, నివేదన, నిరాజన, మంత్రపుష్పము శాత్తుమరై, తీర్థ ప్రసాద గోష్ఠి జరుగుతుంది.

**బంగారు గోపుర కుంభ సంప్రోక్షణకు అంతా సిద్దం - ఈవో భాస్కర్ రావు**

స్వర్ణవిమాన గోపుర కుంభ సంప్రోక్షణకు అంతా సిద్దం చేశాం. బుధవారం స్వస్తివాచనంతో మొదలయ్యే పంచకుండాత్మక సుదర్శన యాగం ద్వారా కుంభ సంప్రోక్షణ పర్వాలకు శ్రీకారం చుట్టనున్నాం. బుధవారం నుండి 23 వరకు ఐదు రోజుల పాటు పంచకుండాత్మక సుదర్శన యాగం జరపనున్నాం. దీని కోసం యాగశాల, పంచ కుండలాలు రెడీ చేశాం. యాగానికి అవసరమయ్యే ఆవునెయ్యి, మోదుగు కర్ర సామాగ్రిని అందుబాటులో ఉంచాం. 23న స్వర్ణవిమాన గోపురానికి మహాకుంభ సంప్రోక్షణ నిర్వహిస్తాం.

**పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు**

- ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు

స్వర్ణవిమాన గోపుర కుంభ సంప్రోక్షణ కోసం నిర్వహించే పూజలన్నీ పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహిస్తాం. మొదటగా 19 నుండి 23 వరకు యాగశాలలో పంచకుండాత్మక సుదర్శన యాగం నిర్వహిస్తాం. 23న స్వర్ణవిమాన గోపురానికి కుంభ సంప్రోక్షణ పూజలు చేయనున్నాం. స్వర్ణమయమైన దివ్యవిమాన గోపురానికి, సుదర్శన చక్రానికి కుంభ సంప్రోక్షణ నిర్వహించి ప్రతిష్టా పర్వాలు ముగిస్తాం. స్వర్ణవిమాన గోపురంపై సుదర్శన చక్రానికి సంప్రోక్షణ పూజలు చేసి స్వర్ణవిమాన గోపురాన్ని స్వామివారికి అంకితం ఇస్తాం.

**నేటి సాయంత్రం కార్యక్రమాలు**


సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం ద్వారా అధికుంభార్చన బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన, మూర్తి మంత్ర హెూమములు, వరుణానుక హెూమము, జలాధివాసము, నిత్య పూర్ణహుతి, నివేదన, తీర్థ ప్రసాద గోష్టి, తిరువీధి సేవ, ఆలయంలోకి వేంచేయడం జరుగుతాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్. భాస్కరరావు వెల్లడించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు నల్లంతీగల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు ఉప ప్రధానార్చకులు, వేద పండితులు, పారాయణికులు ఈ కైంకర్యాలను నిర్వహిస్తారు.

## బంగారు వర్ణంతో మెరిసిపోతున్న గుట్ట ఆలయం

బంగారు విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహెూత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట ఆలయ మంతా విశేష విద్యుత్ దీపాల అలంకరణలో వెలుగులీను తున్నది. బంగారు వర్ణంతో కనువిందు చేస్తున్నది. దీనికోసం సర్వాంగ సుందరంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. విశేష విద్యుత్ దీపాల అలంకరణలతో ఆలయమంతా బంగారు వర్ణంతో వెలుగుల... జిలుగులను పంచుతున్నది.

దేవస్థానం కార్యనిర్వహణాధికారి ముందస్తు పక్క ప్రణాళికతో ముందుకు సాగుతూ ఏర్పాట్లను పూర్తి చేశారు. అధికారులు దేవస్థానం సిబ్బంది, గత నెల రోజులుగా చేస్తున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. కొండపైన జరుగనున్న మహెూత్సవం సందర్భంగా పోలీసులు శాఖ కూడా అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లాలో గల ఉన్నతాధికారులతో పలుదపాలుగా దేవస్థానం ఈవో, జిల్లా కలెక్టర్ సమీక్షలు జరిపి విజయవంతం కోసం కసరత్తు చేశారు. పోలీస్ శాఖ భారీ బందోబస్తుకు శ్రీకారం చుట్టనున్నది.









జనరల్
GENERAL

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

బుధవారం
19 ఫిబ్రవరి
2025





# ఐదు రోజులు జరిగే పూజా పర్వాల వివరాలు







**ఈ నెల 20న ఉదయం:**
యాగశాల ప్రవేశం, వేద ఇతిహాసాది పురాణ స్తోత్ర పారాయణం, హవనాలు, నీరాజన మంత్రపుష్పం, శాత్తుమరై, తీర్థప్రసాదగోష్టి.

**సాయంత్రం:**
ద్వారాది కుంభార్చన, అగ్ని ఆరాధన, ఛాయాధివాసం, తిరువీధి సేవ, నివేదన, వారుణానువాక, హెూమాలు.

**ఈ నెల 21న ఉదయం:**
చతుస్థానార్చన, విమాన దిగ్దేవతా విశేష హెూమాలు, పంచవింశతి కలశ స్నపనం, నీరాజన మంత్ర పుష్పం, శాత్తుమరై.

**సాయంత్రం:**
విష్ణు సహస్రనామ పారాయణ, ద్వారాది కుంభార్చన, చతుస్థానార్చనలు, ధాన్యాధివాసం, నిత్య పూర్ణాహుతి

**ఈ నెల 22న ఉదయం:**
చతుస్థానార్చన, విమాన అధిష్టాన పరివార విశేష హెూమాలు, ఏకాశీతి కలశ స్నపనం, నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాదగోష్టి.

**సాయంత్రం:**
ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల అగ్ని ఆరాధనలు, జీవన్యాస, తత్వన్యాస, కళాన్యాస ప్రాణప్రతిష్ఠ హెూమాలు, శయ్యాధివాసం, ఫల పుష్పాధివాసం.

**ఈ నెల 23న ఉదయం:**
మహాపూర్ణాహుతి, వేదశాత్తుమురై, ఉదయం 11:54 గంటలకు 'స్వర్ణవిమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ', మహారాజభోగ నివేదన, పెరియ శాత్తుమురై.

**సాయంత్రం:**
ఆస్థాన మండపంలో శాంతి కల్యాణం





## మహాకుంభాభిషేక సంప్రోక్షణకు పటిష్ట బందోబస్తు

**- రాచకొండ సీపీ సుధీర్ బాబు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఈ నెల 19 నుంచి 23 వరకు యాదగిరిగుట్ట దేవస్థానంలో జరిగే మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహెూత్సవాలకు పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. మంగళవారం ఆయన యాదగిరిగుట్టలోని హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశం, నూతన బస్టాండ్ ప్రదేశాలను.. యాదాద్రి భువనగిరి జోన్ డీసీపీ రాజేష్ చంద్రతో కలిసి ఆయన పరిశీలించారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను సిబ్బందితో కలిసి చర్చించారు. కుంభ సంప్రోక్షణ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉన్నందున.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. పార్కింగ్ సమస్యలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు, వీఐపీలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున.. భద్రతా ఏర్పాట్లను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్, భువనగిరి ఏసీపీ కంకణాల రాహుల్ రెడ్డి, యాదగిరిగుట్ట సీఐ రమేష్, ట్రాఫిక్ సీఐ కృష్ణ తదితరులు ఉన్నారు.

## సహకార సంఘాలను కాంగ్రెస్ సర్కార్ నిర్వీర్యం చేస్తోంది

**- ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏడాది కాలంలో సహకార సంఘాలు నిర్వీర్యంగా మారాయని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్, వంగపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి విమర్శించారు. వంగపల్లి, పీఏసీఎస్ చైర్మన్లుగా ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా నిర్వహించిన కారణంగా.. మంగళవారం యాదగిరిగుట్టలో పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని రామకృష్ణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డితో పాటు యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాలను కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని, తద్వారా సహకార సంఘాలు నిర్వీర్యానికి గురై రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. పదేళ్ళ బీఆర్ఎస్ హయాంలో సహకార సంఘాల బలోపేతానికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ చొరవ, సంకల్పంతో నష్టాల్లో ఉన్న డీసీసీబీ, పీఏసీఎస్ లు లాభాల్లోకి వచ్చాయన్నారు. తాను ఉమ్మడి నల్గొండ డీసీసీబీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పుడు సంస్థ పీకలలోతు అప్పుల్లో ఉండగా.. కేవలం మూడేళ్లలోనే రూ.104 కోట్ల ప్రాఫిట్ లోకి తెచ్చామని గుర్తుచేశారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఊహించని ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో.. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దీనిని గమనించే కులగణన రీసర్వే సాకుగా చూపి స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశారని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ కు ఎదురుదెబ్బ తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు కంబాల మల్లేశం, బత్తిని రామకృష్ణ, మేకల రాజు, ధీరావత్ రమేష్, మాజీ సర్పంచులు ధీరావత్ బుజ్జి శంకర్ నాయక్, కొండం అరుణ అశోక్, గుండ్ల సరిత మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య, రైతులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## సిద్ధులగుట్టను పర్యాటక కేంద్రం గా గుర్తించాలి

**ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డా. మోహనకృష్ణ డిమాండ్**

**క్షేత్ర చరిత్ర పై రచించిన పరిశోధనా వ్యాస కరపత్రాల ఆవిష్కరణ**



జనగామ, ఫిబ్రవరి18: (రోమింగ్ న్యూస్) : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరులో వెలసిన ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం, స్వయంభూ సిద్ధేశ్వర స్వామి శైవ పుణ్య క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆధ్యాత్మిక, ధార్మిక సంఘాలు ఎప్పటినుండో కోరుతున్నాయని కాబట్టి వెంటనే అనేక మహిమలు, సిద్ధులు కలిగిన ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడానికి దేశం నలుమూలల నుండి భక్తులు వస్తుంటారని, కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తిస్తూ అభివృద్ధి పరచాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ మోహన కృష్ణ భార్గవ డిమాండ్ చేశారు. సిద్ధులగుట్ట క్షేత్ర చరిత్రపై తాను రచించిన పరిశోధనాత్మక వ్యాస సంకలన కరపత్రాన్ని మంగళవారం దేవస్థానంలో ఆవిష్కరించి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మాట్లాడారు. శ్రీ స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో పూజ్యశ్రీ సిద్ధాశ్రమం సుధానంద స్వామి, దేవస్థాన ప్రధానార్చకులు ఓం నమఃశివాయ, ఎంఆర్ఓ ప్రకాష్ రావ్, సీఐ ఎమ్ అబ్బయ్య, ఆలయ ఈవో చిందం వంశీ, ఎంపీడీవో మల్లికార్జున్, పంచాయతీ సెక్రెటరీ రూప చైతన్య, డాక్టర్ ఝాన్సీ, ఆలయ చైర్మన్ అందాల మల్లారెడ్డి, పంచాయతీరాజ్ అధికారులు మరియు స్వాములు, చరిత్ర పరిశోధకులు, రచయితలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధుల సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మోహనకృష్ణ భార్గవ రచించి ప్రచురించిన విశ్లేషణాత్మక పరిశోధన వ్యాస సంకలనం "కొడవటూరు సిద్ధులగుట్ట (సిద్ధాద్రి) క్షేత్ర చరిత్ర, వైభవం, మహాత్మ్యం" కరపత్రాలను ఆవిష్కరించారు. ఇట్టి కరపత్రాలను సిద్ధేశ్వర స్వామికి సమర్పించిన అనంతరం మోహనకృష్ణ మాట్లాడుతూ.. ఒకనాడు శతాబ్దాల చరిత్ర కలిగిన గొప్ప శైవ మహాక్షేత్రంగా, జానపద సంస్కృతులకు, ఋషిపరంపరాగత సాంప్రదాయాలకు నెలవై యోగుల తపోవనంగా, కాకతీయుల కాలంలో ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందిన సిద్ధులగుట్ట నేడు ఆదరణ, గుర్తింపు, అభివృద్ధి పొందలేకపోతున్నదని అన్నారు. పర్యాటక కేంద్రానికి కావలసిన భౌగోళిక వనరులు, ఆధ్యాత్మిక క్షేత్రానికి కావలసిన వాతావరణం అన్నిటిని కలిగివున్నప్పటికీ భక్తుల కోరికలను తప్పకుండా సిద్ధించేలా స్వయంభుగా వెలసిన స్వామి తీరుస్తాడని అందుకే సిద్ధులగుట్ట పేరుతో ప్రసిద్ధి చెందినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల అభివృద్ధికి దూరమైందన్నారు. భారతీయ జానపద కళలను, శైవ సంస్కృతులను, ఆధ్యాత్మిక గ్రామీణ విశ్వాసాలను పరిరక్షిస్తున్నటువంటి సిద్ధులగుట్ట విశిష్టతలను ప్రజల్లోకి మరియు ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లే విధంగా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే కాకుండా ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని భవిష్యత్తుకు పదిలంగా అందించినవారమవుతామని అన్నారు. అందులో భాగంగా తనవంతు కృషి సుధీర్ఘకాల పరిశోధన "సిద్ధులగుట్ట క్షేత్ర చరిత్ర, వైభవం, మహాత్మ్యం" కరపత్ర రూపంలో అందించినట్లు డాక్టర్ భార్గవ తెలిపారు. భక్తిశ్రద్ధలతో భక్తులు కోరుకున్న కోరికలు సిద్ధించే విధంగా స్వయంభుగా వెలసిన శివపరమాత్ముడు తప్పకుండా భక్తుల కోరికలు తీరుస్తూ ఆశీర్వదిస్తాడని, అందుకే భారతదేశ వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తుంటారని, ఇలాంటి గొప్ప మహిమ కలిగిన పుణ్యక్షేత్రం చరిత్రను గొప్పగా రచించిన డాక్టర్ మోహన్ కృష్ణను ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల ప్రముఖ్ కొత్తపల్లి రాజయ్య, జనగామ నగర ప్రముఖ్ డా అంబటి బాలరాజు, జిల్లా సహాయ కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, సాంస్కృతిక విభాగ్ మాదాసు రాజేశ్వర్ భార్గవ, చక్రాల పోచన్న, కవి నక్క సురేష్, అర్చకులు సదాశివ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి పూల రవీందర్ ను గెలిపించి చరిత్ర సృష్టించాలి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**



నకిరేకల్ : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలే రేపటి భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాలను శాసించనున్నాయని ఈ ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థి పూల రవీందర్ ను బీసీలంతా సంఘటితమై గెలిపిస్తే రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేసి, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి సీఎం కావడం ఖాయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు బీసీ సంక్షేమ సంఘం బీసీల ఓటు బీసీలకే ఓటు మనదే సీటు మనదే అనే నినాదంతోటి చేపట్టిన బీసీల ప్రచార యాత్రలో భాగంగా మంగళవారం నకిరేకల్ పట్టణ కేంద్రం లోని పద్మశాలి భవన్ లో బీసీ ఉపాధ్యాయ సంఘం సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు తెలంగాణ రాష్ట్రంలో ఐదు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి ఉపాధ్యాయ సంఘాలు గెలుపు గుర్రాల పెరుతో రెడ్లకు బి ఫామ్ లు ఇచ్చాయని, బీసీలకు మాత్రం టికెట్లు ఇవ్వడానికి నిరాకరించారని, అందుకే ఈ ఎన్నికలలో నల్లగొండ, వరంగల్, ఖమ్మం నియోజక వర్గంలో రెడ్ల పాలనకు చరమగీతం పాడాలంటే ప్రస్తుతం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో "బీసీల ఓటు బీసీలకే వేసి" రెడ్ల రాజకీయాలకు అడ్డుకట్ట వేయాలని ఉపాధ్యాయులకు శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు తెలంగాణ రాష్ట్రంలో రెడ్ల పాలనకు చరమగీతం పాడాలంటే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే బీసీలు వేదికగా చేసుకోవాలని, ఈ ఎన్నికలలో అగ్రకులాలకు బీసీలు తమ ఓట్లు నిరాకరించడం ద్వారా వారిని ఓడించి,బీసీలను గెలుపించి బీసీలు రాజకీయ అధికారం కైవసం చేసుకోవాలని ఆయన పిల్లునిచ్చారు ఈనెల 17 నుండి 26 వ తేదీ వరకు "బీసీల ఓటు బీసీలకే" నినాదంతో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో సభలు సమావేశాలు సెమినార్లతో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అగ్రూరి వెంకటేశ్వర్లు నేతృత్వలో పాపని వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు జటంగి వెంకట నరసయ్య యాదవ్, బీసీ సంఘం నాయకులు తిరుగుడు రవి యాదవ్, రాచకొండ వెంకన్న, సామంతపు మురళి, చామల నరసయ్య బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్, తదితరులు పాల్గొన్నారు

